క్లుప్తంగా

వైభవంగా పూర్ణ కుంభాల ఊరేగింపు



పూర్ణ కుంభాలను ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా లోని నిడుగల్ హోబళి పరిధి లోని అరసికెరె గ్రామంలో బసవ జయంతి ని పురస్కరించుకుని108 పూర్ణ కుంభ కళశాల ఊరేగింపు గురువారం వైభవంగా జరిగింది. గ్రామం లోని బసవేశ్వర ఆలయం నుంచి చన్న మల్లికార్జున స్వామి దేవాలయం వరకు ఊరేగింపు సాగింది. అనంతరం 108 కుంభాల జలాన్ని మల్లికార్జున స్వామి మూల విగ్రహానికి అభిషేకం చేశారు. చన్నమల్లికార్జున స్వామి ఆలయ సమితి అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి రుద్రమునియప్ప, వాగేశ్ ఆరాధ్య, దొడ్డణ్ణ, నింగప్ప, సిద్ధ లింగప్ప, మంజునాథ్ తదిరులు పాల్గొన్నారు.

కర్బూజ పంట ధ్వంసం



పంటను ధ్వంసం చేసిన దృశ్యం

మడకశిరరూరల్: ఆమిదాలగొంది గ్రామ సమీపంలో కర్బూజ పంటను ఎలుగుబంట్లు ధ్వంసం చేశాయి. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు నాగభూషణరెడ్డి బోరుబావి కింద కర్బూజ పంట సాగు చేశాడు. బుధవారం రాత్రి ఎలుగుబంట్లు పొలంలోకి ప్రవేశించి కాయలు కొరికేయడంతోపాటు పంటను మొత్తం ధ్వంసం చేశాయి. ఘటనలో దాదాపు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

ఘనంగా పర్తిసాయి సేవాదళ్ వార్షికోత్సవం



రొద్దంలో సత్యసాయి చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

రొద్దం: మండల కేంద్రంలోని పర్తిసాయి సేవాదళ్ ద్వితీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రొద్దం సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి భజన మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. నగర కీర్తన, వక్తల సందేశం, బాల వికాస్ గ్రూప్–1 సర్టిఫికెట్ల పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు, నిరుపేదలకు దుస్తుల పంపిణీ చేశారు. భక్తి గీతాలు ఆలపిస్తూ భజన బృందాల చేత భజనలు చేపట్టారు. సాయంత్రం సత్యసాయి చిత్రపటం పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, సమితి కన్వీనర్లు, భజన మండలి కన్వీనర్లు, భక్తులు పాల్గొన్నారు.

శుభకార్యం

పరిగి: మండల కేంద్రంలోని బీరలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఎర్రగుంట సర్పంచ్ బాలకృష్ణ సోదరుడు శ్రీనివాసులు కుమారుడి రమేష్ వివాహం తిరుమలదేవరపల్లికి చెందిన ఆనంద్ కుమార్తె మధుప్రియతో జరిగింది. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్, ఆమె భర్త చరణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఉషశ్రీచరణ్ దంపతులు వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట మండల కన్వీనర్ నరసింహమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

సోమందేపల్లి: చాలకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజనప్ప ఇటీవల గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ గురువారం రామాంజనప్ప నివాసానికి వెళ్లి పరామర్శించారు. అధైర్యపడవద్దని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర ఆర్టీసీ డీఎంగా రంగభాష్యం



డిపో మేనేజర్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా రంగభాష్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు మునుపు డీఎంగా పని చేస్తున్న రామసుబ్బయ్య ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే.ఈసందర్భంగా నూతన మేనేజర్‌ను ఈయూ నాయకులు రంగనాథ్, కేటీస్వామి, సిద్ధగంగప్ప,నాయక్, శివకుమార్ తదితరులు ఘనంగా సన్మానించారు.

వార్డు ఇక్కడ.. సచివాలయం అక్కడ

- సమయానికి అందుబాటులో ఉండని సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న వార్డు ప్రజలు



మేళాపురంలో ఉన్న 32వ వార్డులోని అహమ్మద్ నగర్ సచివాలయం

హిందూపురం టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలన్న సంకల్పంతో ప్రతి వార్డులో ఒక్కో సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ ఆశయానికి తూట్లు పొడిచేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. వార్డులో ఉండాల్సిన సచివాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించడంతో ఆ వార్డు పరిధిలోని ప్రజలు సేవలు అందక, ఇతర వార్డులో ఉన్న సచివాలయానికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని అహ్మద్‌నగర్‌లో ఉండాల్సిన సచివాలయాన్ని మేళాపురం సర్కిల్‌కు మార్చారు. ఆ ప్రాంతానికి చెందిన వారు వ్యయప్రయాసాలకోర్చి మేళాపురానికి వెళ్లాల్సి వస్తోంది. అలాగే 33వ వార్డు సచివాలయంలోనే 31వ వార్డు, 33వ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఇతర వార్డులకు సంబంధించిన సచివాలయాలను ఇక్కడే నిర్వహిస్తున్నారు. మూడూ ఒక్క చోటే ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సచివాలయంలో ఏ చిన్న పని ఉన్నా ఇతర వార్డుల్లో ఉన్న సచివాలయాలకు వెళ్లాలంటే ఖర్చుతో కూడిన పని అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాలను ఆయా వార్డులోనే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వ భవనాలు లేవనే కారణంతో ఇతర చోట్ల ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చారు.

అందుబాటులో లేని సిబ్బంది

సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలి. అయితే పలు వార్డుల్లో సచివాలయం సిబ్బంది ఫీల్డ్ పేరుతో సచివాలయంలో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు అనే సార్లు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నామని వాపోతున్నారు. సమస్య చెప్పుకుందామని వస్తే ఇక్కడ సరిగా సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, ఫీల్డ్‌కు వెళ్లారని, మరోసారి రావాలని చెప్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

వ్యయ ప్రయాస



స్థానికంగా మా వార్డులో సచివాలయం లేకపోవడంతో ఎంతో వ్యయప్రయాసలు పడుతూ మేళాపురంలో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. నా కుమారుడి ఆధార్ కార్డు విషయంగా అహ్మద్‌నగర్ నుంచి రూ.60 ఖర్చు పెట్టుకొని పిల్లాడిని తీసుకొని మండుటెండలో మేళాపురంలో ఉన్న సచివాలయానికి వచ్చాను. అయితే ఇక్కడ సిబ్బంది అందుబాటులో లేక నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. ప్రతిసారి ఖర్చు పెట్టుకొని ఎలా వెళ్లాలి?..

– రాఫియా, అహ్మద్ నగర్

వార్డు పరిధిలోనే సచివాలయం ఉండాలి



గతంలో మా వార్డు పరిధిలోనే సచివాలయం ఉండేది. అక్కడి వెళ్లి పనులు చూసుకొని తక్కువ సమయంలోనే ఇళ్లకు చేరుకునేవాళ్లం. కానీ అహ్మద్‌నగర్‌లో ఉన్న సచివాలయాన్ని మేళాపురం వద్దకు మార్చారు. ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లాలంటే ఆటో చార్జీలు, సమయం, ప్రయాసలు తప్పవు. అదీ కాక ఇక్కడ పని ఎప్పటికి పూర్తవుతుందో అప్పటి వరకు వేచి ఉండాలి. తమ వార్డులోనే సచివాలయం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– బీబీ ఆయిషా, అహ్మద్ నగర్

ఆర్డీటీ సమస్య పరిష్కారానికి కృషి

- ఎంపీలు మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి హామీ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి



ఆర్డీటీ సమస్యను మిథున్‌రెడ్డికి వివరిస్తున్న ఆనందరంగారెడ్డి

మడకశిర: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత మిథున్‌రెడ్డి, రాజ్యసభ నేత వైవీ సుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్లు ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేత నితిన్‌రెడ్డి తెలియజేశారు. గురువారం వారు విజయవాడలో ఎంపీలను కలిశారు. ఈసందర్భంగా ఆనందరంగారెడ్డి సాక్షితో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌ను కలిసి ఆర్డీటీ సమస్యను వివరించినట్లు తెలిపారు. గతంలో కూడా ఈ సమస్య తలెత్తిందని, వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించినట్లు వైఎస్ జగన్ చెప్పారన్నారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలను కలిసి ఆర్డీటీ సమస్యను వివరించినట్లు తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఈసమస్య వచ్చినప్పుడు వెంటనే ఆయన కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్డీటీ సమస్యను ఏమాత్రం జాప్యం చేయకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎంపీలు హామీ ఇచ్చారన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ వర్గాలు గురువారం వెల్లడించాయి. యూత్ విభాగం అధ్యక్షుడిగా మనోజ్ కుమార్, మహిళా విభాగం కవితారెడ్డి, రైతు విభాగం జయశంకర్‌రెడ్డి, బీసీ సెల్ విభాగం రామాంజనేయులు, ఎస్సీ సెల్ విభాగం సూర్య మోహన్, ఎస్టీ సెల్ విభాగం బాబా నాయక్, మైనార్టీ విభాగం అబ్దుల్ సలామ్, క్రిస్టియన్ మైనార్టీ విభాగం నాగేంద్ర కుమార్, విద్యార్థి విభాగం కదిరేశ్, పంచాయతీ విభాగం శేఖర్‌రెడ్డి, మున్సిపల్ విభాగం కురుబ లక్ష్మీనారాయణ, ఆర్‌టీఐ విభాగం నాగేందర్‌రెడ్డి, వలంటీర్ విభాగం నవీద్, గ్రీవెన్స్ సెల్ విభాగం రమేశ్‌రెడ్డి, వాణిజ్య విభాగం రామకృష్ణారెడ్డి, వీవర్స్ విభాగం బాలాజీ, వైఎస్సార్‌టీయూసీ మహంతుల్లా, అంగన్‌వాడీ విభాగం కురుబ సిద్ద గంగమ్మ, లీగల్ సెల్ విభాగం వెంకట్‌రెడ్డి, కల్చరల్ విభాగం చంద్రశేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా విభాగం శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఐటీ విభాగం గిరీష్‌రెడ్డి, దివ్యాంగుల విభాగం సాయి జుల్లా, డాక్టర్స్ విభాగం డాక్టర్ అమీర్ ఖాన్, ఇంటలెక్చువల్ విభాగం ధనుంజయ్ రెడ్డి, బూత్ కమిటీ విభాగం హనూక్, పబ్లిక్ రిలేషన్ విభాగం శబరీష్‌రెడ్డిలను నియమించారు.

మడకశిర: మడకశిర నియోజకవర్గానికి సంబంధించిన వైఎస్సార్‌సీపీ వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించినట్లు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. లీగల్ సెల్ వైసీ గోవర్ధన్‌రెడ్డి, యూత్ విభాగం శేషాద్రి, మహిళా విభాగం వరలక్ష్మి, రైతు విభాగం గంగాధర్‌గౌడ్, బీసీ సెల్ శివకుమార్, ఎస్సీ సెల్ శివన్న, ఎస్టీసెల్ శ్రీనివాసనాయక్, మైనార్టీ సెల్ రఫిక్‌సాబ్, కిస్టియన్ మైనార్టీ సెల్ నరసింహ, విద్యార్థి విభాగం నగేష్, పంచాయతీరాజ్ విభాగం శ్రీనివాసులు, మున్సిపల్ విభాగం హసేన్‌బాషా, ఆర్టీఐ విభాగం సన్నమారప్ప, వలంటీర్ల విభాగం లక్ష్మీనరసప్ప, గ్రీవెన్స్ సెల్ తిమ్మరాయప్ప, వాణిజ్య విభాగం సుధాకర్, వీవర్స్ విభాగం మంజు, వైఎస్సార్ టీయూసీ విభాగం మల్లేష్, అంగన్‌వాడీ విభాగం శిల్పారాణి, కల్చరల్ విభాగం కృష్ణారెడ్డి, సోషల్ మీడియా విభాగం మల్లేగౌడ్ ఐటీ విభాగం చిత్తన్న, దివ్యాంగుల విభాగం తిప్పేస్వామి, డాక్టర్ల విభాగం పుట్టబసప్ప, ఇంటెలెక్చువల్ విభాగం శివానంద్, బూత్ కమిటీ విభాగం మల్లికార్జున, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా సికిందర్ నియమితులయ్యారు.

గవి రంగనాథ స్వామికి పూలజ్యోతులు



గవిరంగనాథస్వామికి పూల జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

హిందూపురం: మండలంలోని చలివెందులలో వెలిసిన శ్రీలక్ష్మి గవి రంగనాథ స్వామి కళ్యాణ, రథోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గ్రామస్తులు పెద్ద ఎత్తున మూలవిరాట్ రంగనాథస్వామికి పూజలు చేశారు. కొండపై వెలిసిన లక్ష్మి గవి రంగనాథస్వామి బ్రహ్మ రథోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో సహస్ర నామ పూజలు, దీపోత్సవం చేశారు. అన్నదానం ప్రసాద వినియోగం చేశారు. రాత్రి శ్రీలక్ష్మి, రంగనాథస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలతో తీసుకొచ్చి కళ్యాణ వేదికపై అలంకరించి, వేదికపై కళ్యాణోత్సవంలో కొలువు దీర్చారు. శుక్రవారం ప్రత్యేక పూజలతోపాటు పెద్ద ఎత్తున రథోత్సవం, 3న ప్రత్యేక పూజలతోపాటు ముత్యాల పల్లకీ పార్వేట ఉత్సవం, 4న శేషావాహనం, శయనోత్సవ కార్యక్రమాలు జరగనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కష్టపడిన కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో గుర్తింపు



దుద్దేబండలో కాఫీ విత్ వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పెనుకొండ రూరల్: కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను వైఎస్సార్‌సీపీ గుర్తిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ అన్నారు. గురువారం మండలంలోని దుద్దేబండ గ్రామంలో కాఫీ విత్ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని ఉష శ్రీ చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. దివ్యాంగుల పింఛన్, రైతు భరోసా తదితర సమస్యలు ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ కూటమి హయాంలో సంక్షేమ పథకాలు అందక పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వంద శాతం సంక్షేమ పథకాలు, అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, సర్పంచ్ గౌతమి, పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకర్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్లు శ్రీకాంత్ రెడ్డి, నాగలూరు బాబు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాశ్‌రెడ్డి, నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, రవీంద్రరెడ్డి, రాము, చిట్రా మల్లికార్జున, ముకుందా రెడ్డి, వెంకట్రాముడు, రామాంజి, మంజునాథ్‌రెడ్డి, చెన్నకేశవ, హనుమంత రెడ్డి, పిట్టాబాబు, కొండల రాయుడు, నారాయణ, సాయిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన బావికి కంచె ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డు పక్కన ఉన్న బావికి గోడ నిర్మిస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్: పెనుకొండ నుంచి అనంతపురం నుంచి వెళ్లే రహదారిలో తిమ్మాపురం సోలార్ పరిశ్రమ ఎదురుగా పురాతన బావి ఉంది. నూతనంగా రోడ్డు నిర్మించినప్పటికి అధికారులు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే రహదారి ఇది. రాత్రి సమయాల్లో అదుపు తప్పి వాహనాలు బావిలో పడే అవకాశం ఉండడంతో 'పొంచి ఉన్న ప్రమాదం' అనే కథనం 'సాక్షి' లో ఫిబ్రవరి 22 న వెలువడింది. ఈ కథనానికి స్పందించిన అధికారులు పురాతన బావికి కంచెగా, రెండు మీటర్లు ఎత్తుతో 30 మీటర్ల పొడువుతో సిమెంట్ గోడ నిర్మాణ పనులు చేపట్టారు.

కార్మికుల హక్కులను పరిరక్షించాలి



హిందూపురం: కార్మికులను సన్మానిస్తున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ



హిందూపురం: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు



రొళ్లలో మానవహారంగా ఏర్పడిన సీఐటీయూ అనుబంధ సంఘం నాయకులు



గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద వేడుకలు చేసుకుంటున్న కార్మిక సంఘాలు, కార్మికులు

హిందూపురం టౌన్ /హిందూపురం అర్బన్ : కార్మికుల హక్కులను పరిరక్షించాలని జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ పేర్కొన్నారు. గురువారం లోక్ అదాలత్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరా పార్కులో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. పారిశుద్య కార్మికులు చేస్తున్న సేవలు మరెవరూ చేయలేరన్నారు. అనంతరం ఉత్తమ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాసులు, ఈఎస్ వెంకటేష్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు నాగరాజు రెడ్డి, సుదర్శన్, సిద్దు, కళావతి, సంతోషి కుమారి, సతీష్, ఉదయ్ సింహారెడ్డి, ఈశ్వరప్ప, అబ్దుల్లా, సందీప్, రసూల్ బీ, లోక్‌అదాలత్ సిబ్బంది హేమావతి, శారద పాల్గొన్నారు.

మేడే స్పూర్తితో పోరాడుదాం

మేడే స్పూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలపై పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాలాద్రి పిలుపునిచ్చారు. గురువారం మేడే సందర్భంగా ఇందిరాపార్కు నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. మే 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

హిందూపురం: పట్టణంలోని తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం, ఏఐటీయూసీ తాలుకా సమితి ఆధ్వర్యంలో వివిధ ఫ్యాక్టరీల కార్మికులు, సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఎస్‌బీఐ సర్కిల్ నుంచి చెక్ పోస్టు వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బాబు, కార్యదర్శి దేవరాజు, జలసాధన సమితి కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా కార్మికులు గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం కార్మిక జెండా ఆవిష్కరించారు. అలాగే పాలసముద్రం సమీపంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం నిర్వహించారు.

రొద్దం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పక్రోద్దీన్, సీఐటీయూ, రైతు సంఘం, హమాలీ యూనియన్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండల వ్యాప్తంగా కార్మికులు మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు, ఆటో కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు వెంకటేష్, రామచంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి నగర్‌లో సీపీఐ, ఏఐటీయూసీ, అంగన్‌వాడీ కార్యకర్తలు కార్మిక దినోత్సవాన్ని గురువారం జరుపుకున్నారు. నాయకులు శివప్ప, గౌతమ్‌కుమార్, మారయ్య, గంగన్న, జగదీష్, సిద్దప్ప, నాగరాజు పాల్గొన్నారు.

పెనుకొండ: పెనుకొండ పట్టణంలో గురువారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, వాటి అనుబంధ సంఘాలైన సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు ఎర్ర జెండా ఎగురవేసి నినాదాలు చేసారు. కార్యక్రమంలో నాయకులు హరి, బాబావలి, రమేష్, శ్రీరాములు పలువురు నాయకులు పాల్గొన్నారు.



చిలమత్తూరులో ర్యాలీ చేస్తున్న కార్మికులు



పెనుకొండలో మేడే వేడుకలు



అమరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిరలో ఆర్టీసీ కార్మికులకు స్వీట్లు తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి

ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	38.0
పెనుకొండ	41.0
మడకశిర	38.0

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



సమన్వయకర్త ఈరలక్కప్పను సన్మానిస్తున్న దృశ్యం

గుడిబండ: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజవర్గ సమప్వయకర్త ఈరలక్కప్ప పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు సూచించారు. గురువారం వివిధ విభాగాల అధ్యక్షులు శేషాద్రి, సికిందర్, సుధాకర్, నరసింహ తదితరులు పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్పను స్వగ్రామంలో కలిసి సన్మానించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎదురుతిరిగే రోజులు దగ్గర పడాయని పేర్కొన్నారు. కూటమి నాయకుల దౌర్జన్యాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కొవాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు హరి, ప్రసాద్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



శస్త్ర చికిత్సకు ఎంపికైన రోగులు

పావగడ: తిరుమణి పీహెచ్‌సీ కేంద్రంలో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి, హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 135 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు చేయగా 75 మంది శస్త్ర చికిత్సకు ఎంపికైనట్లు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రఫీక్

పరిగి: మండల కేంద్రంలోని పాత షుగర్ ఫ్యాక్టరీ గేటు సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. మండల కేంద్రంలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమ ఎదురుగా చిరు వ్యాపారం చేసుకుంటున్న దివంగత హుస్సేన్‌ఖాన్ కుమారుడు రఫీక్(మూగ వ్యక్తి) ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపు తప్పి ఓ చింతచెట్టును ఢీకొట్టడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలవడంతో వెంటనే అతడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించినట్లు తెలిసింది.

సువర్ణ వాసవీ మాత విగ్రహానికి క్షీరాభిషేకాలు



విశేష అలంకరణలో వాసవీకన్యకా పరమేశ్వరీ దేవి మూలవిరాట్

హిందూపురం: హిందూపురంలోని ప్రముఖ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి 85 వసంతాలు పూర్తయిన సందర్భంగా జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మూలవిరాట్ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి అభిషేకాలు చేశారు. రజత తోరణ కవచ ధారణతో అలంకరించారు. గణపతి హోమం, కలశ స్థాపన, నూతన స్వర్ణ వాసవీమాత విగ్రహానికి పంచగవ్య క్షీర, జలాదివాసంతో పూజలు చేశారు. సాయంత్రం సువర్ణ వాసవి విగ్రహానికి ధాన్య, పుష్పావాసములు, వాస్తు హోమం నిర్వహించి మంగళహారతులు చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాము, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నూతన సువర్ణ వాసవీమాత విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కమిటీ సభ్యులు